AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
7-5-2026 (Thursday) MAIN EDITION

## మే 10న భాగ్యనగరానికి మోదీ..



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ మే 10 ఆదివారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఐటీ కారిడార్‌లో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో పాటు, సికింద్రాబాద్ వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. అంతకుముందు బేగంపేటలోనే పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన దేశానికి అంకితం చేయనున్నారు. ప్రధాని రాక సందర్భంగా, అత్యున్నత భద్రతా నియమాల ప్రకారం హైదరాబాద్‌లో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## వీవో నుంచి ప్రీమియం ఫోన్



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వీవో భారత మార్కెట్ లోకి మరో కొత్త మోడల్ ను తీసుకువచ్చింది. ఎక్స్ 300 ఎఫ్‌ఈ పేరుతో విడుదల చేసింది. స్నాప్ డ్రాగన్ 8 జెన్ 5 ప్రాసెసర్, 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, 90డబ్ల్యూ ఫాస్ట్ చార్జింగ్ సపోర్టుతో వచ్చిన ఈ మోడల్.. ఈ 14 నుంచి ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వివో ఇండియా ఆన్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉండనుంది.

## పుదుచ్చేరి సీఎం రాజీనామా




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ నాయకుడు ఎన్.రంగస్వామి పుదుచ్చేరి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్‌నాథన్‌కు సమర్పించారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన పార్టీ విజయం సాధించింది. దీంతో మరోసారి సీఎం కానున్నారు.

## సాధారణ ట్రాఫిక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్



**అక్షరటుడే, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీ నుంచి వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లో ప్రయాణించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా ఒక మార్గంలో పోలీసులు అనుమతించారు.

## తమిళనాడులో ధర్నాలకు పిలుపు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడు వ్యాప్తంగా శుక్రవారం ధర్నాకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. గవర్నర్, బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసనలు చేపట్టనుంది. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ కుట్రలు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**అక్షరటుడే, తిరుమల:** తిరుమల లడ్డూ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ఆరోపణలకు సంబంధించి, ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికపై తగిన చర్యలు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన మరో హై లెవెల్ కమిటీ ఏర్పాటు చేసింది. ఛైర్మన్ సీఎస్, సభ్యులుగా డీజీపీ లా సెక్రటరీని నియమించింది. వారంలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

**కరీంనగర్ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడ కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. అలాగే కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.** - అక్షరటుడే, కరీంనగర్

# కరీంనగర్‌లో హైటెన్షన్..



- కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కౌశిక్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- ఎమ్మెల్యేపై దాడికి బీజేపీ నాయకుల యత్నం
- కారుతో పాటు ఫర్నిచర్ ధ్వంసం

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కొందరు బీజేపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. ఆయన కారుతో పాటు కమలాకర్ కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు.

### బండి సంజయ్‌పై తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో..

కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌పై తీవ్రమైన విమర్శలు చేశారు. ఆయన తంబాకుతో డ్రగ్స్ కలిపి తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అందుకే అందువల్లే ఆయన తలపై వెంట్రుకలు ఊడిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని.. అయితే సంజయ్ కూడా టెస్టులకు రావాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. బండి సంజయ్.. గతంలో తన భార్య పుస్తెలు అమ్మి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారని.. మరి కార్పొరేషన్ ఎన్నికల్లో 50 కోట్లు ఎలా ఖర్చు చేశారంటూ నిలదీశారు. దీంతో ఆగ్రహానికి లోనైన బీజేపీ కార్యకర్తలు దాడులకు దిగారు.

### నేను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదు

తాను రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఏమీ చేయలేదని కౌశిక్ రెడ్డి అన్నారు. కేటీఆర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని.. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని మాత్రమే చెప్పానన్నారు. ఎమ్మెల్యేనే చంపడానికి వస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు.



### నాపై హత్యాయత్నం చేశారు..: కౌశిక్ రెడ్డి

ఈ ఘటనపై కౌశిక్ రెడ్డి స్పందించారు. నన్ను హత్య చేయడానికి కొందరు ప్రయత్నించారని వ్యాఖ్యానించారు. ఇది రేవంత్, బండి సంజయ్ కలిసే ప్లాన్ చేశారని ఆరోపించారు. నన్ను హత్య చేసేందుకు రెక్కీ చేస్తున్నారని విలేకరుల సమావేశంలో చెప్పానని.. చెప్పినట్లుగానే నాపై దాడికి యత్నించారన్నారు. ఈ ఘటనతో రేవంత్, బండి సంజయ్ కలిసిపోయారని తేలిపోయిందన్నారు. కరీంనగర్‌లో శాంతిభద్రతలు లేవని.. ఈ ప్రాంతానికి గన్‌కల్చర్ తీసుకొస్తున్నారని అడిగానని.. దొంగలను ఎందుకు పట్టుకోలేదని అడిగితే నాపై దాడికి పాల్పడుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## మొహాలీ ఈడీ సోదాల్లో హైడ్రామా..

**అక్షరటుడే, పంజాబ్ :** పంజాబ్‌లోని మొహాలీలో ఈడీ సోదాలు తీవ్ర కలకలం రేపాయి. మనీ లాండరింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై దృష్టి సారించిన అధికారులకు నిందితులు ఊహించని షాక్ ఇచ్చారు. ఖరార్‌లోని 'వెస్టర్న్ టవర్స్' అపార్ట్‌మెంట్‌లో సోదాలు జరుగుతుండగా, 9వ అంతస్తులోని 906 నంబర్ ఫ్లాట్ నుంచి నిందితులు భారీగా నగదు ఉన్న బ్యాగులను కిందకు విసిరేశారు. కింద సిద్ధంగా ఉన్న ఒక వాహనం, పైనుంచి పడ్డ నోట్ల బ్యాగులను తీసుకుని అధికారుల కళ్లు గప్పుతూ అక్కడి నుంచి వేగంగా తప్పించుకుంది. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఆపరేషన్ సింధూర్‌కు ఏడాది..




**అక్షరటుడే, ఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్ చేపట్టి నేటికి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఏడాది క్రితం, ఆపరేషన్ సింధూర్ సందర్భంగా మన సాయుధ దళాలు సాటిలేని ధైర్యం, కచ్చితత్వం, సంకల్ప బలాన్ని ప్రదర్శించాయి. పహల్గామ్‌లో అమాయక భారతీయులపై దాడి చేయడానికి సాహసించిన వారికి వారు తగిన విధంగా సమాధానం ఇచ్చారు. మన దళాల శౌర్యానికి యావత్ దేశం వందనం చేస్తోంది. ఆపరేషన్ సింధూర్, ఉగ్రవాదంపై భారతదేశం దృఢమైన ప్రతిస్పందనను, జాతీయ భద్రతను పరిరక్షించడంలో అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబించింది. ఉగ్రవాదాన్ని ఓడించడానికి, దానికి ఆజ్యం పోసే వ్యవస్థను నాశనం చేయడానికి దృఢ సంకల్పంతో ఉన్నాం." అని రాసుకొచ్చారు.

## తృణమూల్ కీలక భేటీకి 10 మంది ఎమ్మెల్యేల డుమ్మా..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని మమతా బెనర్జీ స్పష్టం చేయడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పరిస్థితిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు, భవిష్యత్ వ్యూహాలను ఖరారు చేసేందుకు మమతా బెనర్జీ ఇటీవల ఒక కీలక సమావేశాన్ని నిర్వహించారు. అయితే, ఈ భేటీకి కొంతమంది ఎమ్మెల్యేలు దూరంగా ఉండడం చర్చనీయాంశమైంది. విజయం సాధించిన 80 మంది ఎమ్మెల్యేలలో కేవలం 70 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారని సమాచారం. దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు ఈ కీలక భేటీకి రాకపోవడంతో పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏసీబీ వలలో అటవీశాఖ అధికారులు

**అక్షరటుడే, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణలో ఏసీబీ దూకుడు పెంచింది. అవినీతికి పాల్పడుతున్న అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటోంది. ఇటీవల చాలా మంది అధికారులు అనిశాకు పట్టుబడ్డారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. ఏమాత్రం భయం లేకుండా లంచాలు తీసుకుంటున్నారు. తాజాగా.. భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కొన్ని చెట్లు తొలగించారు. దీంతో కేసు నమోదు చేయకుండా ఉండడం కోసం భద్రాచలం అటవీశాఖ ఎఫ్‌డీవో సుజాత రూ.పది లక్షలు డిమాండ్ చేశారు. అయితే ఈ క్రమంలో రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు సుజాతతో పాటు చర్ల ఇన్‌ఛార్జి డీఆర్వో కృష్ణయ్యను పట్టుకున్నారు.



## స్టైలిష్ లుక్‌లో కృతి సనన్..




**అక్షరటుడే, సినిమాడెస్క్: బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న కృతి సనన్. అందం, అభినయంతో పాటు.. స్టైలిష్ మేకోవర్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఒక ఈవెంట్లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది ఈ బ్యూటీ. బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ప్రోత్సాహంతో జరుగుతున్న ఫెమినా బ్యూటీ అవార్డ్స్ 2026 వేడుకలో భాగంగా పలు బాలీవుడ్ తారలు రెడ్ కార్పెట్ పై మెరిసారు. ముంబై నగరంలో జరిగిన ఈవెంట్లో పలువురు సెలబ్రిటీలు తమ అందాలతో అందరి దృష్టిని ఆకట్టుకున్నారు.**

## వాహనాల అమ్మకాలలో జోరు..



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** భారత ఆటోమొబైల్ రంగం దూసుకెళ్తోంది. 202627 ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ప్రారంభించింది. ఒక్క నెలలోనే 26 లక్షల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. దేశీయంగా వాహన రిటైల్ విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగాయి. గతేడాది ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏడాది ఏప్రిల్‌లో 12.94 శాతం వృద్ధి నమోదయ్యింది. గతేడాది ఏప్రిల్‌లో 23,12,221 యూనిట్లు అమ్ముడవగా.. ఈసారి 26,11,317 యూనిట్లకు పెరగడం గమనార్హం. ఈ విషయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) వెల్లడించింది. ఆర్ బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు, జీఎస్టీ సంస్కరణలు, వివాహాల సీజన్ వంటి అంశాలు ఈ వృద్ధికి ప్రధాన కారణాలని పేర్కొంది.



## స్పేస్‌లో రష్యా సీక్రెట్ ఆపరేషన్..!

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** రష్యా అంతరిక్షంలో చేపట్టిన అత్యంత రహస్య ప్రయోగాలు అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తున్నాయి. గత ఏప్రిల్ 28న భూమికి సుమారు 585 కిలోమీటర్ల ఎత్తులో (లో ఎర్త్ ఆర్బిట్), రష్యాకు చెందిన రెండు కీలక ఉపగ్రహాలు ఒకదానికొకటి అత్యంత చేరువగా వచ్చి చేసిన విన్యాసాలు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచాయి. రష్యాకు చెందిన కాస్మోస్ 2581, కాస్మోస్ 2583 ఉపగ్రహాలు అంతరిక్షంలో ప్రయాణిస్తూ.. ఒకానొక దశలో వాటి మధ్య దూరాన్ని కేవలం 10 అడుగులకు తగ్గించుకున్నాయి. ఈ రెండు ఉపగ్రహాలు దాదాపు సున్నా సాపేక్ష వేగంతో ఉంటూ, ఎంతో నియంత్రిత పద్ధతిలో పక్కపక్కనే ప్రయాణించాయి. అమెరికాకు చెందిన స్పేస్ ట్రాకింగ్ సంస్థలు మొదట దీనిని ఒక ప్రమాదంగా భావించి అప్రమత్తమయ్యాయి. అయితే, రష్యా ఉపగ్రహాలు అనేక సూక్ష్మ మాన్యువర్లను నిర్వహించి, ఒకదానికొకటి అతి దగ్గరగా ఉండేలా స్థితిని మార్చుకున్నాయని తర్వాత గుర్తించారు. ఇది అనుకోకుండా జరిగింది కాదని, రష్యా పక్కా స్కెచ్‌తో చేసిన ప్రయోగమని నాసా నిపుణులు నిర్ధారించారు.